

## వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

వరంగల్ వాయిస్ నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్–మంజుల దంపతుల 33వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం పత్రిక కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి, డెస్క్ ఇంచార్జి గోలి రవి శాలువాతో ఘనంగా సన్మానించారు.

– వరంగల్ వాయిస్ డెస్క్


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 205
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
మే 15, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# పుష్కరుడి ఆహ్వానం







జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోచ్ఛరణలతో మారుమోగుతోంది. దక్షిణ కాశీగా పిలువబడే కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగమంలో గురువారం ఉదయం 5.44 గంటలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. వేకువ జామునే సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ గురుమదానానంద సరస్వతి పీఠాధిపతులు శ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానాలు ప్రారంభించారు. దీంతో త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పుష్కర పుణ్య స్నానాలు చేశారు. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమం అయిన కాళేశ్వరంలో ఈ నెల 26వరకు మొత్తం 12 రోజుల పాటు పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

- వరంగల్ వాయిస్, మహాదేవపూర్





- అంగరంగ వైభవంగా ప్రారంభమైన పుష్కర స్నానాలు
- ప్రారంభించిన శ్రీ మాధవానంద సరస్వతి స్వామి
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పుష్కర స్నానం చేసిన మంత్రులు దుద్దిళ్ల, పొంగులేటి, పొన్నం
- స్వాగతం పలికిన మంత్రి కొండా సురేఖ

వివరాలు2లో..



8లో..

## ‘సంత’ను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర మినిమం వేజ్ బోర్డ్ సభ్యుడు బాసాని చంద్రప్రకాష్
- గట్లకానిపర్తిలో ప్రారంభం

## సంస్కృతి పేరుతో.. పరువు తీశారు



8లో..

- విదేశీయుల కాళ్లు కడగడం సిగ్గుచేటు
- ఇది తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి జరిగిన ఘోరమైన అవమానం
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



8లో..

## నేరస్థులను గుర్తించడంలో.. ఫింగర్ ప్రింట్ కీలకం

☐ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

# పుష్కరుడి ఆహ్వానం

- అంగరంగ వైభవంగా ప్రారంభమైన పుష్కర స్నానాలు
- ప్రారంభించిన శ్రీ మాధవానంద సరస్వతి స్వామి
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పుష్కర స్నానం చేసిన మంత్రులు దుద్దిళ్ల, పొంగులేటి, పొన్నం
- స్వాగతం పలికిన మంత్రి కొండా సురేఖ

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర క్షేత్రం సరస్వతి పుష్కరాలకు వేదికైంది. గోదావరి, ప్రాణహితతోపాటు అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగంమంలో గురువారం ఉదయం 5.44 గంటలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. వేకువజామున శ్రీ గురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి సరస్వతి ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. గోదావరిలోని సరస్వతి ఘాట్ లో సరస్వతి నది పుష్కరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన సతీమణీ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హై కోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడింగ్ కార్పోరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతి పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హజరయ్యారు. విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరుడికి తొలి పూజలు చేసిన తరువాత సరస్వతి నది పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పరణ నిర్వహించారు.





### హాజరైన ముఖ్యమంత్రి, మంత్రులు..

తెలంగాణ దక్షిణ కాశి పిలువబడే కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. వేకువ జామునే ఇక్కడికి చేరుకున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన సతీమణీ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పుష్కర పుణ్య స్నానాలు చేశారు. సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిలకు మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు ఘన స్వాగతం పలికారు.

### ప్రత్యేక ఆకర్షణగా హారతి..

పుష్కరాల సందర్భంగా ప్రతిరోజు సరస్వతి ఘాట్ వద్ద సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు నిర్వహించనున్న సరస్వతి నవరత్న మాల హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. కాశీలో ప్రతి రోజు నిర్వహిస్తున్న గంగ హారతికి ఏమాత్రం తీసిపోని విధంగా సరస్వతి నవరత్న మాల హారతి నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు గాను ప్రత్యేకంగా కాశి నుంచి వేద పండితులను తీసుకొచ్చారు. త్రివేణి సంగమంలో మొట్ట మొదటి సారిగా కాశీ పండితులు నిర్వహించిన నదీ హారతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ పుష్కరాలకు తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.





### పుష్కర స్నానం చేసిన సీఎం..

మే 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు నిర్వహించనున్న పవిత్ర సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోని ముక్తీశ్వర క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్రివేణి సంగమం వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి ఘాట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనంతో పుష్కర స్నానం చేశారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు సరస్వతి ఘాట్‌లో నిర్వహించిన నదీ హారతిలో ఆయన పాల్గొన్నారు.



## కాళేశ్వరం భక్తులకు అన్నదానం..

**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వెళ్లే భక్తుల సహాయార్థం కమలాపూర్ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గురువారం ప్రారంభించారు. సోలీస్ ఐకేర్ హాస్పిటల్, హైదరాబాద్ తోపాటు దాతల సహకారంతో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని సరస్వతి పుష్కరాలు ముగిసేవరకు ప్రతి రోజు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రతిరోజూ రెండు వేల మందికి ఇక్కడి ఉచితంగా అన్నదానం చేయనున్నారు. అయితే కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వచ్చిపోయే భక్తులు కమలాపూర్ క్రాస్ రోడ్డులో ఆగి భోజనం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతీరోజూ మూడు రకాల కర్రీస్, ఒక వడతో పాటు మజ్జిగతో కూడిన భోజనాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం అక్కడున్న అధికారులు, భక్తులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మధ్యాహ్న భోజనం చేశారు.





# నష్టపరిహారం చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు

### సీడ్ కంపెనీలకు మంత్రి సీతక్క హెచ్చరిక

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాదులోని అగ్రికల్చర్ డైరెక్టరేట్ కార్యాలయంలో విత్తన కంపెనీల ప్రతినిధులతో గురువారం మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. వాజేడు, వెంకటాపూర్ మండలాలతో పాటు కన్నాయిగుడెంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి సీతక్క ఆదేశించారు. లేని పక్షంలో కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టి, క్రిమినల్ చర్యలు చేపడుతామని హెచ్చరించారు. విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, పలువురు వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సీడ్ కంపెనీల తీరు పట్ల మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసి.. నకిలీ విత్తనాలతో నష్టపోయిన పంటలను, రైతుల వివరాలను సేకరించి అందుకు అనుగుణంగా రైతులకు కంపెనీల ద్వారా నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. నకిలీ విత్తనాలను సరఫరా చేస్తే సహించేది లేదన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైల్ లో వేస్తామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# సీఎం రేవంత్ రెడ్డిది పార్గదర్శక పాలన

- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటే
- సుస్థిరత పాలన కాంగ్రెస్ కే సాధ్యం
- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం గురువారం నిడిగొండ గ్రామ సమీపంలోని శ్రీ సత్య ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. సభకు జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరు ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో పారదర్శక పాలన కొనసాగుతోందని, అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీనే దేశానికి స్థిరమైన పాలన అందించగల శక్తిగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యదిశలో పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు కలుగుతుందని, పాతకాలం నుంచి పార్టీకి




అంకితంగా సేవ చేసిన నేతలకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ముఖ్యమైన పదవుల కోసం అర్హులు అభ్యర్థించవచ్చని సూచించారు. బీజేపీ–బీఆర్ఎస్ మధ్య కుమ్మక్కు రాజీకాయాలను విమర్శించిన వారు, మోడీ –కేసీఆర్ కలిసి గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బీజేపీకి అనుకూలంగా డమ్మీగా పెట్టారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు – మహిళలకు ఉచిత రవాణా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ, రూ.20 వేల కోట్లతో రైతు రుణ మాఫీ వంటి వాటిని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి మండలాల వారీగా కార్యకర్తల సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జంగా రాఘవరెడ్డి, లింగయ్య యాదవ్, లింగాల జగదీశ్ చందర్ రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, మారుజోడు రాంబాబు, మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి-రవి

**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల అమలును గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి అన్నారు . రేగొండ మండలంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల నియామక కార్యక్రమం కొనసాగుతున్న సందర్భంగా ఆమె ఈ మేరకు స్పందించారు. భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు, కొడవటంచ ఎంపీటీసీ పరిధిలో ఇన్‌చార్జిలుగా ఉన్న పున్నం రవి, మాజీ ఎంపీటీసీ పట్టెం శంకర్ నేతృత్వంలో జోగయ్యపల్లి, గూడపల్లి గ్రామాల్లో కార్యకర్తల సమక్షంలో సమావేశాలు నిర్వహించి గ్రామ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా పున్నం రవి మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించేందుకు గ్రామ కమిటీల పాత్ర కీలకమని, ఈ కమిటీలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, ఎమ్మెల్యే జీఎస్ఆర్ సూచనలు పాటిస్తే, నాయకత్వ పదవులు తానే వస్తాయని పేర్కొన్నారు. జోగయ్యపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అలువాల రాజయ్య,



ఉపాధ్యక్షుడిగా మిడిమిళ్ళ రాజయ్య, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల జోగేందర్, కోశాధికారి బండారి శ్రీనివాస్ లు ఎన్నిక కాగా, గూడపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పోసాని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నూకల సంపత్, కోశాధికారి మోర్ కిరణ్, యూత్ అధ్యక్షుడిగా ముద్దమల్ల నరేష్ ఎన్నికయ్యారు. ఈ కమిటీల్లో సోషల్ మీడియా కోఆర్డినేటర్, బీసీ సెల్, ఎస్సీ సెల్, కిసాన్ సెల్, మహిళా విభాగాలకు కూడా నాయకులను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ఎర్రబెల్లి రవీందర్ రావు, యువజన నాయకులు పున్నం ప్రవీణ్, కొమ్మురాజు భాస్కర్, ఇతర ప్రజా ప్రతినిధులు, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ :** ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధ్యక్షతన మే-2025 ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే-2025 ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు (థియరీ) ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి ఏడాది పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకని, రెండో ఏడాది పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరగనున్నాయన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన (10) పరీక్ష కేంద్రాల్లో (2383) మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, (1560) రెండవ సంవత్సరం విద్యార్థులతో కలిపి మొత్తం (3943) మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని వెల్లడించారు. ఈ మేరకు (10) మంది చీఫ్ సూపరింటెండెంట్లు, (10) మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, (01) అదనపు చీఫ్ సూపరింటెండెంటు, (01) కస్టోడియన్, (01) ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. నిర్దేశించిన మూడు మార్గాల ద్వారా ప్రశ్నపత్రాలను ఆయా పరీక్ష కేంద్రాలకు పటిష్ట భద్రత



నడుమ చేరవేయాలన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలు) సరిచూసుకోవాలన్నారు. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా అధిక సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది సరిపడా ఔషధ నిల్వలతో కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. అలాగే www.tsbie.cgg.gov.in ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అదే విధంగా దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబ్ సౌకర్యాన్ని కల్పించాలని, అందుకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని, ప్రతి కేంద్రంలో ర్యాంప్ వసతి, తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. విద్యార్థులు ఏమైనా సందేహాలు ఉంటే టెలీ మానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించాలని, తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ సమన్వయ సమావేశంలో డీఐఈఓ జితేందర్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, జనగామ :** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. గురువారం జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి, కుర్చపల్లి గ్రామ పంచాయతీల్లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత రిజిస్టర్లను, ఓపీఎంఎస్ లో నమోదు చేసే ధాన్యం కొనుగోళ్లు, రైతుల వివరాలను, కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తేమ శాతం, బరువు కొలిచే విధానం, రికార్డుల నిర్వహణ, రశీదుల జారీ గురించి కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. ధాన్యం బస్తాలను లారీల్లో వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. ఓపీఎంఎస్ లో రైతులు, ధాన్యం కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ఈ కేంద్రాల తనిఖీలో కలెక్టర్ వెంట తహసీల్దార్ మోసిన్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆపరేషన్ సింధూర్ కాల్పుల విరమణపై అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోడీ మౌనాన్ని ఖండిస్తూ, జైహింద్ కార్యక్రమంలో భాగంగా ఈ నిరసన జరిగింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్‌కు సంపూర్ణ మద్దతు ఉందని, కానీ కాల్పుల విరమణను ట్రంప్ జోక్యంతో అంగీకరించడం తగదన్నారు. బీజేపీ దీనిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. పాకిస్థాన్ లోని ఉగ్రవాద శిబిరాలు పూర్తిగా నశింపజేయబడే వరకు ఆపరేషన్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అంతేకాక, గూడూరు మండలం రాములునాయక్ తండాలో విద్యుత్ షాక్‌తో మరణించిన నూనావత్ వినోద్ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# లాదెళ్లలో ఉచిత ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, దామెర :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలంలోని లాదెళ్ల గ్రామంలోని రూరల్ హెల్త్ సెంటర్ లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్, పాలకవర్గం మాట్లాడుతూ లాదెళ్ల గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించి బీపీ షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి 100మందికి ఉచితంగా మందులు పంపిణి చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జె.కిషన్ రావు, డా.మొహమ్మద్ తయార్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, ఎ.గంగాధర్, జగదీశ్వర్, శ్రీకాంత్, నర్సింహా చారి, పోషాలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**◆ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి**



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ఈనెల 20న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు సహా అన్ని వర్గాల ప్రజలు చురుకైన పాత్ర పోషించి, శ్రామిక వర్గాల పోరాట స్ఫూర్తిని ప్రదర్శించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. గురువారం ఖిలా వరంగల్ ఛమన్ సెంటర్ మరియు శివనగర్ గోడౌన్ ప్రాంతాల్లో "మే 20 సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం" అనే నినాదంతో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ, గత 11 ఏళ్లుగా కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వ హయాంలో కార్మికులు, రైతుల జీవన ప్రమాణాలు తీవ్రంగా పడిపోయాయని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినప్పటికీ, కార్మికుల వేతనాలు పెంచకపోవడం వల్ల వారు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జీవితాన్ని దుర్భరంగా గడుపుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య రక్షణ వంటి ప్రాథమిక హక్కులు కూడా కార్మికులకు లభించడం లేదన్నారు. తెలంగాణలో ఇటీవల అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు కార్మికులకు, కర్షకులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విరమించి, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, రైతులకు పంటలకు గిట్టుబాటు ధర గ్యారంటీ చట్టం తీసుకురావాలని, పనిగంటలు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెను విజయవంతం చేయడంలో ప్రజలు, మేధావులు, విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నేతలు మైదంపాణి, అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్), ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) నేతలు సాబిరీకాని మోహన్, నర్సయ్య, ఏలియా, వెంకన్న, మధు, మహేందర్, ప్రశాంత్, వెంకటేష్, రాజేందర్, రాజు పాల్గొన్నారు.

## పచ్చి రొట్టు ఎరువులతో భూమికి జీవం



**వరంగల్ వాయిస్, దామెర:** పులుకుర్తి గ్రామంలోని రైతు వేదికలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్త" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పచ్చిరొట్టు ఎరువుల ప్రాముఖ్యతపై వివరించారు. పచ్చిరొట్టును భూమిలో కలిపినపుడు నత్రజని సహా ఇతర ముఖ్య పోషకాలు భూమికి అందుతాయని, తద్వారా భూసారత పెరిగి పంటల ఉత్పత్తి మెరుగవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఖచ్చితంగా పంట మార్పిడి చేయడం ద్వారా భూమిలో రోగాలు, కీటకాల ప్రభావం తగ్గిపోతుందని వరంగల్ శాస్త్రీయ పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా. బి. సలాడ్స్ చంద్ర పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో మట్టి నమూనాలను సేకరించి, భూమిలో ఉన్న పోషకాల స్థాయిని అంచనా వేసి, అవసరమైన ఎరువులను సిఫారసు చేయాలని సూచించారు. చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ విధానాలు పాటించాలని, నియంత్రిత మందులైన నాగసుయినట్టి, కొడరక్ రిడి, సూజాకునాస్ వంటి వాటిని వినియోగించవచ్చని డా. జి. పర్మ్ తెలిపారు. విత్తనాలు, మూలాలు, మందుల కొనుగోలు చేసిన అనంతరం అందిన రసీదులను భద్రంగా ఉంచాలని సూచించారు. రైతులకు లాభదాయకమైన పంట ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం "రైతు రిజిస్ట్రేషన్" అనే ప్రత్యేక పథకం అందిస్తోందని మండల వ్యవసాయ అధికారి ఏ.రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దామెర మండలం ఏసీడీ ఏవీ.రణసింహ, కళాశాల విద్యార్థులు ప్రశాంత్, కుమారి రీమా చక్రవర్తి పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాలకు చల్లాకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామ శివారులోని హజ్రత్ సైలాని బాబా దర్గాలో ఈ నెల 21, 22 తేదీలలో జరిగే ఉర్సు ఉత్సవాలకు హాజరుకావాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని హనుమకొండలోని వారి నివాసంలో నిర్వాహణ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆమీర్ బాబా, అహ్మద్ బాబా, షేక్ మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** లింగాలగణపురం మాజీ జడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడి వంశీధర్ రెడ్డి, మండల కేంద్రం రఘునాథపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా, కాంగ్రెస్ యువజన నాయకుడు మమ్మద్ రషీద్ తల్లి జాహ్నబీ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని, వారి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, కీసర దిలీప్ రెడ్డి, మాజీ సర్పంచులు దూసర గణపతి, బొట్ల భాస్కర్, నాయకులు బస్వగాని అనిల్ కుమార్ గౌడ్, బుసిగంపల ఆంజనేయులు, బత్తిని అశోక్ కుమార్, చీటకూరు సంపత్, ఇటికాల జాస్లిన్, ప్రసాద్, దేవరాయ రాజు, గండి సుఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల జారీపై సానుకూల నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పాలకుర్తికి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని వారిని సీఎం అభినందించారు.

## గ్యాస్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి



**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** గ్యాస్ వినియోగదారులు తమ గ్యాస్ ఏజెన్సీతో సంబంధాన్ని కొనసాగించాలంటే వారికి నాణ్యమైన సేవలు అందించడం తప్పనిసరిగా ఉండాలని అంబుజా గ్యాస్ ఏజెన్సీ మేనేజింగ్ పార్టనర్ పీవీ.మదన్ మోహన్ అన్నారు. హుజురాబాద్‌లోని అంబుజా గ్యాస్ ఏజెన్సీ ప్రాంగణంలో జరిగిన సంస్థ 36వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1989 మే 15న కొద్దిమంది కస్టమర్లతో ప్రారంభమైన సంస్థ, ప్రస్తుతం దాదాపు 26,000 ఇండేన్ వినియోగదారులకు సేవలందించే స్థాయికి చేరిందని పేర్కొన్నారు. వివిధ మనస్తత్వాలున్న కస్టమర్లను చక్కగా నిర్వహించడం, ఎలాంటి సమస్యలు లేకుండా సేవలందించడం సంస్థకు ఎంతో అనుభవాన్ని ఇచ్చిందన్నారు. ప్రజల సహకారంతో సంస్థ 36 ఏళ్లుగా స్థిరంగా ఎదుగుతోందని తెలిపారు. గ్యాస్ వినియోగ సమయంలో ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే, కొన్ని జాగ్రత్తలు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. సిబ్బందిని కండువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ కస్టమర్లు గోపాల్ రెడ్డి, కరాటే రమేష్, సుధాకర్ రెడ్డి, సిబ్బంది పవన్, శరత్, భరత్, భరత్ రెడ్డి, సరిత, డెలివరీ సిబ్బంది కనుకయ్య, భాస్కర్, సురేశ్, ప్రభు, దామోదర్, ప్రశాంత్, కుమార్, సాగర్, నర్సయ్య, రాంబాబు, సీను, రాజు, హరిశ్, కమలాకర్, అనీల్, సురేశ్, ప్రేమ్ చిన్న, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించొద్దు

➲ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

➲ ఎమ్మెల్యే నాయినిని కలిసిన సీఐటీయూ బృందం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర సంస్థకు అప్పగించవద్దని డిమాండ్ చేస్తూ, సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట అరగంట పాటు శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా "మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దు", "భోజన కార్మికుల ఐక్యతే మన బలం", "సీఐటీయూ జిందాబాద్", "అధికారుల మొండి వైఖరి మానుకోవాలి" వంటి నినాదాలు హోరెత్తించాయి. ధర్నా అనంతరం, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ నేతృత్వంలో సంఘ ప్రతినిధులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండు దశాబ్దాలుగా మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా కార్మికులు నిర్వహిస్తున్నారని, ఇప్పుడు అక్షయపాత్రకు అప్పగించడం వల్ల కార్మికులకే కాకుండా విద్యార్థులకు కూడా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అధికారులు కార్మికులతో లేదా యూనియన్ నాయకులతో ఏలాంటి సంప్రదింపులు జరపకుండా ఈ నిర్ణయం తీసుకున్నందుపై వారు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రతి నెలా గౌరవ వేతనాలు సకాలంలో చెల్లిస్తూ, బిల్లులను పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడి అక్షయపాత్రకు అప్పగించే నిర్ణయాన్ని నిలిపేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పెండింగ్ బిల్లులు, ఉద్యోగ భద్రత, వేతనాల సమస్యల్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ధర్నాలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ నిడిగొండ రజిత, కె. సక్కుబాయి, పి. సమ్మక్క, పర్వీన్, పి. పద్మ, సంధ్య, లక్ష్మి, రాధిక, విజయ, వసుంధర, రాణి, తస్లీమ్, షమీం, సరిత, శైలజ, నిర్మల, భద్ర, సుభద్ర, భాగ్యలత, రాజేశ్వరి పాల్గొన్నారు.

# 20న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

**➲ వాల్ పోస్టర్ ఆవిష్కరణ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశవ్యాప్తంగా మే 20న జరగబోయే సార్వత్రిక సమ్మెలో భాగంగా, ఆల్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో ఉదయం 10 గంటలకు మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా మే 20 సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా నేతృత్వంలో ఎంజీఎం హాస్పిటల్ ఆవరణలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ యాకుబ్, ఎండీ మహబూబ్ పాషా, ఏఐసీటీయూ నాయకుడు ఐతం నాగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. దేశంలోని 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని 4 లేబర్ కోడ్స్‌గా మార్చి, కార్మికులకు అన్యాయం చేస్తూ, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగులకు కనీస వేతనాలు పెంచకుండానే, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, 8 గంటల పని హక్కుల వంటి నిబంధనలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం పలు మార్లు దాడి చేస్తున్నదని పేర్కొన్నారు. ధరలు ఆకాశాన్ని తాకుతున్నా కేంద్రం వాటిని నియంత్రించడంలో విఫలమైందని, ధరల పెరుగుదల సరిపడా వేతనాలు పెంచడంలో కేంద్రం విఫలమైందని చెప్పారు. ఈ నేపథ్యంలో మే 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని, వరంగల్ జిల్లాలోని ఎన్‌హెచ్‌ఎం క్యాడర్స్ అందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం హాస్పిటల్‌కు చెందిన ఉద్యోగులు రోహిణి, సింధూజ, ఆర్.భాగ్యలక్ష్మి, ఎం.కోమల, సంధ్య, వసంతరావు, ఆశా కార్యకర్త రాణి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ సూర్య ప్రకాష్–మంజుల దంపతులకు సత్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సాయిబాబా మందిరంలో నిర్వహించే కార్యక్రమాలు ప్రత్యక్షంగా వందల మంది చూస్తున్నా... ఆ విశేషాలు వేల సంఖ్యలో ప్రజలకు చేరవేసే విధంగా వార్తలు రాస్తున్న మిత్రులు, శ్రేయోభిలాషి"వరంగల్ వాయిస్" సీనియర్ జర్నలిస్ట్ సూర్య ప్రకాష్ సతీ సమేతంగా బాబా దర్శనానికి విచ్చేసిన సందర్భంగా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ బాబా శేషవస్త్రంతో సత్కరించి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరు

**బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్**



**వరంగల్ వాయిస్, గణపురం:** కాళేశ్వరం సరస్వతి పుష్కరాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పర్యటనకు ముందు, మండల పోలీసులు చేపట్టిన ముందస్తు అరెస్టులను తీవ్రంగా నిరసిస్తూ బీజేవైఎం కళాశాలాల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్ విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి ప్రజల ప్రాథమిక అవసరాలను విస్మరించి, ప్రపంచ అందగత్తెల పోటీలు వంటి కార్యక్రమాలకు సమయం కేటాయిస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలు, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల సమస్యలు పట్టించుకోకుండా అశ్రద్ధ వహిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల వ్యయంతో సరస్వతి పుష్కరాల కోసం చేసిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో లేకపోయినా, వాటిని ఆగమేఘాల మీద నిర్వహిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను దాచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని మంద మహేష్ హెచ్చరించారు.

# నగరంలో ప్రతి కాలనీకి రోడ్డు వేయిస్తా



**వరంగల్ వాయిస్,హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రత్యేకంగా అభివృద్ధి చేపడుతానని వరంగల్ పశ్చిమ నియోజవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం 10వ డివిజన్ కాపువాడ పీటీసీ పాఠశాల ఆవరణలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ. 25 లక్షలతో అంతర్గత రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తనాజీ వాకాడే తో కలిసి నాయిని చేశారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని కూల్చి వేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతి బస్తీ/ కాలనీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, సైడ్ డ్రైన్, అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం ప్రజలు కూడా అధికారులకు సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ నాసిమ్ జాన్, డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్, నాయకులు మామిడిశెట్టి సతీష్, పల్లం రమేష్, బొంత రామకృష్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతుల భవిష్యత్తుకు భరోసా



**వరంగల్ వాయిస్, నడికూడ :** ఆయిల్ ఫామ్ తోటల సాగు రైతులకు భవిష్యత్తులో వంద శాతం భరోసాను ఇస్తుందని పరకాల డివిజన్ ఉద్యాన శాఖాధికారి టి.మధులిక తెలిపారు. గురువారం నడికూడ మండలం రాయపర్తి గ్రామంలో రైతు వంతడుపుల సుజాత ఆయిల్ ఫామ్ తోటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫామ్ తోటల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ సతీష్ నారాయణ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విస్తీర్ణం పెంచేందుకు మరింత మంది రైతులు ముందుకు రావాలని కోరారు. ఆయిల్ ఫామ్ టన్ను ధర 21,000 ఉందని త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు, తోటలకు డ్రిప్పు ద్వారా ఎరువులను వేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు చట్టబద్ధతో కూడుకున్నదని, మంచి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడికి కృషి చేయాలని రైతులను కోరారు. రాకేష్, ఫీల్డ్ ఆఫీసర్ భరత్, రైతులు పాల్గొన్నారు.

# మూడో విడత ఇందిరమ్మ ఇళ్లకు నెంబర్లు వేయాలి

**◆ సీపీఎం ఆధ్వర్యంలో మహాధర్నా**



**వరంగల్ వాయిస్, జనగామ :** పట్టణంలోని మూడో విడత ఇందిరమ్మ పథకం లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నెంబర్లు వేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది నుంచి మున్సిపల్ కమిషనర్ ఇంటి నెంబర్లు వేయక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలు అడిగినప్పుడల్లా కమిషనర్–తహసీల్దార్ పరస్పరం బదిలీ చేసుకుంటూ సమస్యను తేల్చకుండా వాయిదా వేస్తున్నారని తెలిపారు. 2012–13లో ప్రభుత్వం 114 మందికి ఇండ్ల స్థలాలు ఇచ్చి పట్టాలు ఇచ్చినప్పటికీ, వారికి లోన్లు మంజూరు చేయకపోవడంతో పేదలు తమ ఖర్చుతో ఇండ్లు నిర్మించుకున్నారని తెలిపారు. అయితే, అక్కడ కనీస సౌకర్యాలు—విద్యుత్, మంచినీరు, రోడ్లు లేక ప్రజలు కష్టాల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఇంటికి నంబర్లు వేయాలని మున్సిపల్ అధికారులను కోరితే, ఆ స్థలం శామీర్ పేట గ్రామ పరిధిలో ఉందని, రెవెన్యూ విభాగం చూసుకోవాలంటూ మళ్లీ వదిలేస్తున్నారని ఆరోపించారు. అలానే, 2003లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అర్బన్ డబుల్ బెడ్ రూమ్ పథకం కింద 54 ఇండ్లు, అనంతరం G+2 రూపంలో 144 ఇండ్ల నిర్మాణం చేపట్టిన విషయం గుర్తుచేశారు. ఆ భూమిని అప్పట్లో అండర్‌టేకింగ్ చేసినట్లు చెప్పి, మళ్లీ లేఅవుట్ చేసి, ప్లాట్లు డ్రా ద్వారా పంపిణీ చేశారని, పేదలు వాటిలో ఇండ్లు నిర్మించుకొని నివసిస్తున్నప్పటికీ, నంబర్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ ఎనిమిదేళ్లలో 17 మంది లబ్ధిదారులు తమ ఇంటి కల నెరవేర్చకముందే మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి వెంటనే మెరుగుపర్చకపోతే తహసీల్దార్ కార్యాలయం, మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యులు పోతుకునూరి ఉపేందర్, ఎండి అజారుద్దీన్, భూక్య చందునాయక్, బిట్ల గణేష్, ఇందిరమ్మ లబ్ధిదారుల సంఘ అధ్యక్షుడు కళ్యాణం లింగం, పాముకుంట్ల చందు, పగిడిపల్లి బాలమణి, బండ సౌందర్య, రమావత్ నిత్యనాయక్, ఎండీ గౌసియా, ముసపట్ల జయ, ఎర్ర రజిత, ఎండీ నాజియా, అంజమ్మ, భూనాద్రి వెంకటేష్, కచ్చగళ్ల వెంకటేష్, చిలివేరి ఉపేందర్, మాదాసి సుధాకర్, వెంగల్ దాస్, కుమార్, ఆర్య, సంతోష, లావణ్య, పద్మ, మల్లేష్, బాలస్వామి, కవిత, ఎల్లమ్మ పాల్గొన్నారు.

# కాశిబుగ్గలో మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గలోని లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం నిర్వహిస్తున్న చలివేంద్రంలో గురువారం 42వ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మజ్జిగ దాతలుగా మీసేవ కాశిబుగ్గ వారు, వంగరి ఫ్యామిలీ కుటుంబ సభ్యులు భాగస్వాములయ్యారు. వారు కీ.శే. వంగరి రాజమౌళి కాంతమ్మ జ్ఞాపకార్థంగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన వివేకానంద యోగ సేవ సంస్థ అధ్యక్షుడు కూరపాటి సుదర్శన్ మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు వంగరి రాంప్రసాద్, దేవలపల్లి రాజేశ్వరరావు, మామిడాల రమేష్, కోశాధికారి దుస్సా కృష్ణ, ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, సహాయ కోశాధికారి మామిడాల సతీష్, గౌరవ సలహాదారులు వంగరి రవి, కార్యవర్గ సభ్యులు సాంబారి మల్లేశం, ఆరే రమేష్, మేడి రాజేందర్, గాజుల రాజేష్, సభ్యులు అరికాల శ్రీనివాస్, కోట నగేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# విలేకరిపై దూషణ

## పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ప్రజా సమస్యలపై వార్త కథనం ప్రచురించిన నేపథ్యంలో సంబంధిత వ్యక్తులు విలేకరిపై దూషణకు దిగారు. వివరాల్లోకి వెళ్తే పర్వతగిరి మండల ప్రజా జ్యోతి విలేకరి నాగుల రాజు ప్రజా సమస్యలపై వార్తా కథనాన్ని ప్రచురించిన తర్వాత కొందరు వ్యక్తులు వాట్సాప్ గ్రూప్ లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. రాజు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు ఇంకా చర్యలు తీసుకోలేదని ఆయన పోలీసుల తీరుపై మండిపడ్డారు. పోలీసులు పదేపదే ఆలస్యం చేస్తూ చర్య తీసుకుంటామని హామీ ఇచ్చి కేసు పై ఉదాసీనత చూపిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై ఎస్సై బి.ప్రవీణ్ వివరణ ఇస్తూ విలేఖరి ఇచ్చిన ఫిర్యాదు పై స్పందించి సదరు వ్యక్తిని పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ఘనంగా విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం పశ్చిమ నియోజకవర్గం లోని యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విష్ణ అన్న అంటే నేనున్నా అని ధైర్యం ఇచ్చే వ్యక్తి అని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అలాగే ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్విన్ రాథోడ్, గ్రేటర్ వరంగల్ 4వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు భాష బోయిన శ్రీధర్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గట్లకానిపర్తి నూతన అంగడిలో కూరగాయల విక్రయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఈ రోజు సంత (అంగడి) ప్రారంభోత్సవంలో భాగంగా హనుమాన్ స్వాములు పాల్గొని రకరకాల కూరగాయలు కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైనాల సంతోష్ బాబు, పోషాల శేషు, పోషాల మధు, పల్లెబోయిన సూర్యప్రకాశ్, గుడికందుల శ్రీను, జక్కుల నాగరాజు, రమేశ్, సిద్దు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది ఉండకూడదు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అధికారులకు ఆదేశించారు. సివిల్ సప్లై అధికారులు, ఐకేపీ, కో ఆపరేటివ్ అధికారులతో గురువారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సేకరించిన ధ్యాన్ని ఆలస్యం లేకుండా మిల్లులకు పంపించాలని సూచించారు. జిల్లాల్లో మిగతా ప్రాంతాల్లో ధాన్యం సేకరణ దాదాపు పూర్తయినందున నర్సంపేట నియోజకవర్గం పై అధికారులు పూర్తిగా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీసీఎస్ఓ కిష్టయ్య, డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్య దేవి, డీసీఓ నీరజ, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్పా ల్గొన్నారు.

# వర్షాకాలంలోపే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఇందిరమ్మ పథకం కింద నిర్మించబడుతున్న ఇండ్లను వర్షాకాలం రాకముందే పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులను అడిగి, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం పరిమాణం, ట్యాగ్ అయిన మిల్లుల సంఖ్య, రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతోందా లేదా, గోదాంలో మిగిలిన గన్నీ బ్యాగుల సంఖ్య, ఒక్కో బ్యాగుకు ధర వంటి వివరాలు తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. అలాగే, కలెక్టర్, వీరనారాయణపూర్ గ్రామంలో తొలిదశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులైన సౌందర్య, సుశీలతో మాట్లాడి, వారు నిర్మాణానికి ఉపయోగిస్తున్న మెటీరియల్స్ ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారు, ఇప్పటివరకు ఎంత ఖర్చయింది, ఎప్పుడు పూర్తి చేస్తారు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణం ఒకే రేటు ప్రకారం జరుగుతోందా లేదా అన్న విషయంపై లబ్ధిదారులతో చర్చించారు. గ్రామంలో ఇప్పటివరకు బేస్‌మెంట్ స్థాయిలోకి వచ్చిన ఇండ్ల వివరాలను, వాటికి సంబంధించిన బిల్లులు ఆన్లైన్‌లో సమర్పించారా అనే అంశాలను గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థ నాయక్‌ను ప్రశ్నించారు. ఇంకా ప్రారంభించని ఇండ్ల పనులు ఎప్పుడు మొదలవుతాయో కూడా తెలుసుకున్నారు.వీరనారాయణపూర్ గ్రామంలో మంజూరైన ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని, బేస్‌మెంట్ స్థాయికి వచ్చిన ఇండ్లకు బిల్లులు చెల్లించామన్నారు. మహిళా వీవో గ్రూపుల సహకారంతో ఇతర లబ్ధిదారులు బేస్‌మెంట్ స్థాయికి నిర్మాణం పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే మిగిలిన ఇండ్ల పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా అదనపు కలెక్టర్ మేన శ్రీను, పౌర సరఫరాల శాఖ అధికారి కొమరయ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వరంగల్ కూరగాయల మార్కెట్ కమిటీకి మంత్రి సురేఖ శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం నగరంలోని కృష్ణ కాలనీలో నిర్వహించిన కృష్ణ కాలేజ్ అభివృద్ధి కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా, నూతనంగా ఎన్నికైన వరంగల్ కూరగాయల వర్తక సంఘం కార్యవర్గ సభ్యులు మంత్రి సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ నూతన కార్యవర్గానికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. కూరగాయల వర్తక సంఘం అధ్యక్షుడు జారతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గులాం మున్న, కోశాధికారి మల్లూరి బాబురావు, ఉపాధ్యక్షులు కాసర్ల రాజు, పిన్న మల్లేశం, దామర కొండ కరుణాకర్, బత్తుల నవీన్, సహాయ కార్యదర్శులు చుక్క రవీందర్, పార్ష వీరన్న, బోత్త చందర్, సహకోశాధికారి పిన్నా రాజేష్, సభ్యులు శాత రాసి నాగరాజు, కోరబోయిన రాజేష్ పాల్గొన్నారు. అలాగే గౌరవ అధ్యక్షులు కార్పొరేటర్ చింతాకుల అనిల్, సునీల్, జారతి రమేష్, పార్ష గోపి, కర్ర వెంకన్న తదితరులు హాజరయ్యారు.

# పుష్కర భక్తులకు ప్రతినిత్యం అన్నదానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం త్రివేణి సంగమంగా పేరొందిన కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి 26 వరకు వైభవంగా సరస్వతి పుష్కరాలు జరగనున్నందున భక్తులకు ప్రతిరోజు విశేష అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కాళేశ్వరంలోని శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నసత్రం ఉపాధ్యక్షుడు గట్టు మహేష్ బాబు వెల్లడించారు. ఈమేరకు వరంగల్ రామన్నపేటలో గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేష్ బాబు మాట్లాడుతూ 12 రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అత్యంత వైభవంగా నిర్వహించే పుష్కరాలకు లక్షలాది మంది ఆర్యవైశ్యులు హాజరై పుష్కర స్నానం చేసి స్వామివారి సేవలో తరిస్తారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కుటుంబ సభ్యులతో హాజరయ్యే ఆర్యవైశ్యుల కోసం ప్రతి నిత్యం తమ ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో విశేష అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పుష్కరాలకు హాజరయ్యే భక్తులంతా సద్వినియోగం చేసుకొని వాసవిమాత, సరస్వతీ మాత అనుగ్రహం పొందాలని మహేష్ బాబు కోరారు. ఈ సమావేశంలో సత్రం అధ్యక్షులు సోమ రామయ్య, ఉపాధ్యక్షులు గోరంటల యాదగిరి, యిరుకుళ్ళ రమేష్, ఐతా గోపీనాథ్, గుముడవెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సీఏలో వరంగల్ క్రికెట్ ది కీలక పాత్ర

- క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు
- కుడా చైర్మన్ ఇనగాల వెంట్రామ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గ్రామీణ ప్రాంత క్రికెటర్లకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అండర్–25 ఇంటర్ డిస్ట్రిక్ట్ లీగ్ కోసం జిల్లాల జట్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగాం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల మధ్య నిర్వహించే ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలు కరుణాపురంలోని వంగపల్లి క్రికెట్ మైదానంలో రెండు రోజుల పాటు జరుగుతున్నాయి. ఈ సెలెక్షన్ ట్రయల్స్‌కి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రారంభం చెయ్యగా, క్రీడాకారులను కలిసీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ)లో కీలక పాత్ర దక్కేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే కాకతీయ



పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థల సేకరణ కోసం ముఖ్యమంత్రి గారితో చర్చించిన విషయాన్ని వెల్లడించారు. వరంగల్ క్రికెటర్లు రంజీ, ఐపీఎల్, భారత్ జట్టు వరకు ఎదగాలని ఆశిస్తూ, తన సహాయ సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎంపికైన 6 జట్లు వరంగల్ జిల్లా మొగిలిచర్ల, హనుమకొండలోని రెడిపురం, జనగాం జిల్లాలోని వంగపల్లి టర్ఫ్ మైదానాల్లో ఐదు రోజుల పాటు లీగ్ మ్యాచ్‌లలో పాల్గొంటాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను ఎంపిక చేసి, అండర్–25 టూ డే లీగ్‌కి పంపనున్నారు. ఈ ఎంపికలలో 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో సెలెక్టర్‌లు అఫ్జల్, పవన్, జిల్లా సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షుడు తోట రాము, కోచ్ గోవింద్ సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






# రాజ్‌తో సమంత.. ?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యాక్తిగత జీవితం గురించి రోజుకో వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. ఎంతో ప్రేమించిన అక్కినేని నాగచైతన్యతో విడాకుల తర్వాత సింగిల్‌గా ఉంటుంది సమంత. సమంత కూడా రెండో పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అభిమానులు, సినీ ప్రియులు కోరుకుంటు–న్నారు. అయితే కొద్ది రోజులుగా దర్శకుడు రాజ్ నిడిమోరుతో తరచు కనిపిస్తోంది సామ్.. ఎక్కడికి వెళ్లిన సమంత పక్కన రాజ్ ఉంటున్నాడు. దీంతో ఆమె వైవాహిక జీవితం పై నెట్టింట రూమర్స్ గట్టిగానే ప్రచారం అవుతున్నాయి. అయితే రాజ్ నిడిమోరుకు ఇప్పటికే పెళ్లి అయ్యింది. ఇలాంటి టైం లో తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఇందులో రాజ్‌పై సమంత వాలినట్టుగా కనిపిస్తుంది. దీంతో ఈ వార్తలు మరింత పుంజుకున్నాయి. వారి బాండిరగ్ రోజు రోజుకి బలపడుతుందిగా అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అయితే తాజాగా రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఎక్స్ వేదికగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది.. 'నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి నా గురించి రాసే వారందరికి ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా' అనే పోస్ట్ ను ఆమె షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కొంతకాలంగా ఎలాంటి పోస్ట్ షేర్ చేయని ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అని, ఆమె కచ్చితంగా సమంతని ఉద్దేశించే మాట్లాడుతూంది అని కామెంట్ లు విపడుతున్నాయి.

# దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఎన్టీఆర్ ?



తాజా సమాచారం ప్రకారం సినీ పితామహుడిగా పరిశ్రమ కొనియాడే దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ లో నటించేందుకు తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తుంది. ఈ ప్రాజెక్టు వెనుక రాజమౌళి, కార్తికేయ, వరుణ్ గుప్తా ప్రమేయం కూడా ఉందని టాక్. అంతే కాదు.. ఇప్పటికే స్టిప్ట్ర్ కూడా సిద్ధం కాగా, అది విన్న జూనియర్ ఎన్టీఆర్ చాలా ఎగ్జైట్ అయి ఓకే చేశారట. అయితే భారతీయ చలన చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రెండేళ్ల కిందటనే 'మేడ్ ఇన్ ఇండియా' అనే సినిమా అనౌన్స్ చేయగా, దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో నితిన్ కక్కర్ మూవీని తెరకెక్కించబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, త్వరలో వెల్లడిస్తామని అప్పుడు చెప్పగా, ఆ తర్వాత దాని నోరు విప్పింది లేదు. కాని ఇప్పుడు ఉన్నట్టుండి ఇందులో ఎన్టీఆర్ నటిస్తారని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దాదాసాహెబ్ ఫాల్కే జీవితం చాలా పెద్దది. అలాంటి కథలను కచ్చితంగా ఇప్పటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. అందుకే జూనియర్ ఎన్టీఆర్ లాంటి నటు–డు అయితేనే ఈ ప్రాజెక్ట్ భాగా చేయగలరు. మరి ఇండియన్ సినిమా పుట్టుక, పెరుగుదలను తెలియజేస్తూ.. సినిమాలకి బీజం ఎక్కడ పడిరది, ఎదిగే క్రమంలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వచ్చింది అనేది చిత్రంలో చూపించనున్నారట.

# సరిగమకు ది ప్యారడైజ్ ఆడియో హక్కులు

హిట్ 3తో సూపర్ హిట్ అందుకున్న నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో పాటలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు తెలుస్తుంది. ప్రముఖ మ్యూజిక్ కంపెనీ సరిగమ మ్యూజిక్ రూ. 18 కోట్లకు 'ది ప్యారడైజ్' ఆడియో రైట్స్‌ని దక్కించుకున్నట్లు సమాచారం. నాని కెరీర్‌లో ఒక సినిమా ఆడియో హక్కులకు ఇంత పెద్ద మొత్తం రావడం ఇదే మొదటిసారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదల కాకముందే ఆడియో హక్కులు ఇంత పెద్ద మొత్తానికి అమ్ముడుపోవడం చిత్ర యూనిట్‌కు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రం తెలుగుతో పాటు– హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు– సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.



# తమిళనాట పెద్ద హిట్ కొట్టిన టూరిస్ట్ ఫ్యామిలీ

ఈ మధ్య తమిళంలో పెద్ద సినిమాలకంటే చిన్న సినిమాలే తమ హావా చూపిస్తున్నాయి. ఈ ఏడాదిలో వచ్చిన లబ్బర్ పందు, మెయ్యాళగన్, కుడుంబస్తాన్, డ్రాగన్ చిత్రాలు సూపర్ హిట్‌లు అందుకున్నాయి. అయితే ఇదే కోవలో చిన్న సినిమాగా వచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది టూరిస్ట్ ఫ్యామిలీ. తమిళ నటులు శశికుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటించగా.. యోగి బాబు, మిథున్ జై శంకర్, కమలేష్ జెగన్, ఎం.ఎస్. భాస్కర్, రమేష్ తిలక్, భగవతి పెరుమాళ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. అభిషన్ జీవింత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ముఖ్యంగా ఈ సినిమా చూసిన ప్రేక్షకులు చాలా బాగుందని ప్రశంసిస్తున్నారు. తలైవర్ రజనీకాంత్‌తో పాటు– నటు–డు శివకార్తికేయన్ కూడా ఈ సినిమా చూసి చిత్రబృందంని ప్రత్యేకంగా పిలిపించుకుని అభినందించారు. ఇదిలావుంటే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. కేవలం రూ.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ.55 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. మరోవైపు తక్కువ బడ్జెట్‌తో రూపొందినప్పటికీ, 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రాలలో ఇది ఒకటిగా నిలిచింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం కారణంగా ఒక తమిళ కుటుంబం తమ స్వస్థలాన్ని విడిచిపెట్టి భారతదేశానికి శరణార్థులుగా వస్తారు. అనంతరం వారు చెన్నైలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ప్రయత్నిస్తారు. కానీ వాళ్లు ఎవరు అనేది చెప్పకుండా దాచిపెట్టాల్సి వస్తుంది. అలా దాచిపెడుతూ ఉండగా అనుకోకుండా రామేశ్వరం దగ్గర ఒక బాంబ్ బ్లాస్ట్ సంఘటన జరుగుతుంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేయడం మొదలుపెడతారు. అయితే ఈ కేసుకి వీరికి సంబంధంమేంటి.. శ్రీలంక నుంచి వచ్చిన ఈ ఫ్యామిలీకి ఎదురైన సమస్యలేమిటి అనేది ఈ సినిమా కథ.





# 'సంత'ను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర మినిమం వేజ్ బోర్డ్ సభ్యుడు బాసాని చంద్రప్రకాష్
- గట్లకానిపర్తిలో ప్రారంభం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటు ధరలో నిత్యావసరాలు లభించేలా ఏర్పాటు చేసిన సంతను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మినిమం వేజ్ బోర్డ్ సభ్యుడు బాసాని చంద్రప్రకాష్ కోరారు. శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సంతను బాసాని చంద్రప్రకాష్ గురువారం ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంత ప్రారంభోత్సవ కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన చిరు వ్యాపారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కూరగాయలు, నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచారు. కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమంలో శాయంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, బీజేపీ పరకాల మండల అధ్యక్షులు మార్త భిక్షపతి, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ప్రధాన రాజకీయ పార్టీల గ్రామ శాఖ అధ్యక్షులు, పూర్వ గ్రామపంచాయతీ బోర్డు సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాసాని చంద్రప్రకాష్ మాట్లాడుతూ ప్రతి వారం జరిగే సంతను చుట్టుపక్కల గ్రామస్తులు వినియోగించుకోవాలని సూచించారు. వ్యాపారస్తులు అన్ని రకాల సరుకులను అందుబాటులో ఉంచాలని కోరారు.

# రూ.5 కోట్లతో కళాశాల అభివృద్ధి

- నిర్మాణానికి ముందుకొచ్చిన అరబిందో ఫార్మా
- అభినందించిన మంత్రి సురేఖ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పట్టణంలోని కృష్ణ కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సుమారు ఏడు దశాబ్దాల క్రితం బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా కళాశాలగా మంచి గుర్తింపు ఉన్న కృష్ణ కాలేజీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ ముందుకొచ్చిందన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద సుమారు రూ.5 కోట్లతో మూడు అంతస్తుల్లో 15 తరగతి గతులతో పాటు 60 టాయిలెట్లను నిర్మిస్తున్నందుకు వారిని మంత్రి అభినందించారు. దీనితోపాటు ప్రభుత్వ పాఠశాలను సుమారు కోటిన్నర రూపాయల వ్యయంతో సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం త్వరలో చేపడతామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల భవనానికి అవసరమగు మరమ్మత్తుల కొరకు తన నిధులు కేటాయిస్తానని, అందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో వరంగల్ ను రెండో రాజధానిగా చేయుటకు గాను కృత నిశ్చయంతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. బల్దియా ఆధ్వర్యంలో శాశ్వతంగా డ్రైన్ నిర్మాణం చేపడతామని నగర మేయర్ ప్రకటించడం పట్ల మంత్రి అభినందించారు. భవిష్యత్తులో కృష్ణా కళాశాల వరద నీటి ముంపుకు గురికాకుండా శాశ్వత చర్యల్లో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో రైల్వే ట్రాక్ కింద నుంచి డ్రైన్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలని, రైల్వే అధికారులతో సంప్రదించి పరిష్కారం చేస్తామని మంత్రి తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ..కృష్ణా కాలనీ కళాశాల పునర్ వైభవానికి కృషి చేస్తున్న మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జీడబ్ల్యూఎంసీ తరపున డ్రైన్ నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. తాను కూడా 1982 ఇక్కడే ఇంటర్ చదువుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఆడపిల్లల చదువుకు ఇదే కళాశాల దిక్సూచిగా ఉండేదని, సైన్స్ విద్యార్థులకు చక్కని ల్యాబ్ సౌకర్యం ఈ కళాశాల సొంతం అని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మంత్రి కొండ సురేఖ ప్రత్యేక చొరవ చూపి అరవిందో ఫార్మా వారితో పలుమార్లు సంప్రదించడంతో ఈరోజు సీఎస్ఆర్ కింద రూ.5 కోట్లతో కళాశాల భవనం నిర్మించడం సాధ్యమైవుతుందన్నారు. ఇతర కార్పొరేట్ సంస్థలతో సంప్రదించి త్వరలో ప్రభుత్వ పాఠశాలను కూడా సీఎస్ఆర్ కింద పునర్నిర్మాణం చేయుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పదో తరగతిలో రాష్ట్రంలో ద్వితీయ ర్యాంక్ సాధించిన విద్యార్థిని మంత్రి, మేయర్, కలెక్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్, కావేటి కవిత, బస్వరాజు కుమారస్వామి, సురేష్ జోషి, అరబిందో ఫార్మా డైరెక్టర్ సదానంద రెడ్డి, జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్, కళాశాల ప్రిన్సిపల్ శరదృతి, తదితరులు పాల్గొన్నారు.

### బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి..

ఉపాధ్యాయులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. గురువారం వరంగల్ లోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ హైస్కూల్లో జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడోరోజు మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్యసారదాలు ముఖ్య అతిథులుగా హాజరై పలు సూచనలు చేశారు.

### ఓరుగల్లు శివ శక్తుల సమావేశంలో..

వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్స్ లో ఓరుగల్లు శివ శక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చౌదరి బిరుదాంకిత కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ట్రాన్స్ జెండర్ల సంఘం అధ్యక్షురాలు లైలా, శివ సత్తులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేరస్థులను గుర్తించడంలో.. ఫింగర్ ప్రింట్ కీలకం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** సంఘటన జరిగిన ప్రదేశంలో నేరస్థుల ఆనవాళ్లను గుర్తించి వారిని పట్టుకోవడంలో ఫింగర్ ప్రింట్ విభాగం కీలకంగా పనిచేస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. రాష్ట్ర ఫింగర్ ప్రింట్ విభాగం మంజూరు చేసిన అత్యాధునిక పరికరాలను సీపీ చేతుల మీదుగా స్టేషన్ సిబ్బందికి గురువారం అందజేశారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ఫింగర్ ప్రింట్ విభాగం అధ్వర్యంలో నూతనంగా ఆటోమెటెడ్ మల్టీమోడల్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. వేలి ముద్రలతో పాటు నిందితులకు సంబంధించిన కంటి కనుపాపలు, ముఖాలతో పాటు పాదముద్రలను సేకరించి నూతన పరిజ్ఞానం ద్వారా వీటిని భద్రపర్చడం జరుగుతుందన్నారు. ఇందుకొసం ఫింగర్ ప్రింట్ విభాగం మొదటి విడతగా తొమ్మిది పోలీసు స్టేషన్లకు జారీచేసిన పరికరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పోలీస్ స్టేషన్ సిబ్బందికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనివిధంగా నూతనంగా అందుబాటులోకి తీసుకవచ్చిన టెక్నాలజీని వినియోగించడంలో అధికారులు, సిబ్బంది నిష్ణాతులు కావాలన్నారు. ఈ కార్యక్రమములో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫింగర్ ప్రింట్ ఇన్ స్పెక్టర్లు రాజ్‌కుమార్, శ్రీధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# సంస్కృతి పేరుతో..పరువు తీశారు

- విదేశీయుల కాళ్లు కడగడం సిగ్గుచేటు
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సంస్కృతి పేరుతో తెలంగాణ ఆడబిడ్డల పరువు తీశారని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆరోపించారు. ఇది తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి జరిగిన ఘోరమైన అవమానం అన్నారు. ప్రపంచ అందగత్తెల పోటీదారులు ఓరుగల్లుకు వచ్చిన సందర్భంగా వారి కాళ్లను కడిగించి తెలంగాణ పరువు తీశారని మండిపడ్డారు. ఆ తర్వాత టవల్‌తో వారి కాళ్లు తుడిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మంత్రులు కొండా సురేఖ, సీతక్క సమక్షంలోనే ఇలాంటి నీచానికి పాల్పడడం సహించరానిదన్నారు. రాణి రుద్రమదేవి, సమ్మక్క సారక్క, చాకలి ఐలమ్మ లాంటి వీరవనితలు పుట్టిన నేలలో మహిళలకు ఇలాంటి అవమానం జరుగడం సహించరానిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణతో పాటు, దేశంలోని మహిళ లోకాన్ని ప్రపంచం ముందు అవమానించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. యావత్ తెలంగాణ మహిళా లోకానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని, తమ కాళ్ల మీద తాము నిలబడేలా మహిళల ఆత్మగౌరవాన్ని పెంచుతామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం విదేశీయుల కాళ్లు కడిగించడం ద్వారా ఈ సమాజానికి ఏం సంకేతాలు ఇచ్చారంటూ ప్రశ్నించారు.

# ఖబర్దార్ జగ్గారెడ్డి

- ఈటలను ఏమైనా అంటే నాలుక చీరేస్తాం
- బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జనం మెచ్చిన నాయకుడు ఈటల రాజేందర్ పై నోరు పారేసుకుంటే నాలుక చీరేస్తామంటూ బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఘాటుగా హెచ్చరించారు. ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు..కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అవినీతిని అక్రమాలపై ప్రశ్నిస్తే ఆ ప్రశ్నలకు జవాబు ఇవ్వలేక జగ్గారెడ్డి పదవి కోసం నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నాడంటూ మండిపడ్డారు. రాజేందర్ మీద మరో సారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, ఆరూరి రమేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, సీనియర్ నాయకులు కొరబోయిన రాజ యాదవ్, మంద ఐలయ్య, నరహరి వేణుగోపాల్ రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి, డాక్టర్ కాళి ప్రసాద్, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్ షా, మల్లాడి తిరుపతి రెడ్డి, అల్లం నాగరాజు, తాబేటి వెంకట్ గౌడ్, తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com